క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సైబర్‌వ్యాలీ, సైబర్ విలేజ్, సంకల్ప అపార్ట్‌మెంట్స్, వసంతవిల్లాస్ పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

◆ 11 కేవీ అపర్ణా, 11కేవీ అన్నమాచార్య ఫీడర్ పరిధుల్లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్ఏసీ ప్రధానగేటు రోడ్డు, అపర్ణ అపార్ట్‌మెంట్స్ పరిసరాలు, ఇజ్జత్‌నగర్ విలేజ్, జూబ్లీ గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వివరించారు.

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయి ఐశ్వర్య, ఖాజాగూడ ఫీడర్ల పరిధిలో సాయి ఐశ్వర్య లేఅవుట్, ఖాజాగూడ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, హెచ్ఎండీఏ, హెచ్‌సీసీఎల్, ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా, ఎల్అండ్ టీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉర్దూ యూనివర్సిటీ, టెలికాంనగర్, ఎల్అండ్‌టీ టవర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొండాపూర్ పరిధిలో.... శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ..

వసంత సైబర్‌సిటీ ఫీడర్ పరిధిలోని సైబర్ వ్యాలీ, సైబర్ విలేజ్, సంకల్ప అపార్ట్‌మెంట్స్, వసంత విల్లాస్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాక్ ఎంట్రెన్స్ రోడ్డు పరిసరాలు, అపర్ణ అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్ విలేజ్, జూబ్లీగార్డెన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

పటాన్‌చెరు: రాజకీయాల్లో ఎదుగుతున్న విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం బాధాకరమని మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరులు కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వచ్చి ఎమ్మెల్యేను పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్, మసీదుబండ ప్రాంతాలలోని చిరు వ్యాపారులకు రఘునాథ్ ఫౌండేషన్ శుక్రవారం గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వారికి చేయూత అందించేందుకు ప్రత్యేకంగా గొడుగులను తయారు చేయించామని నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ రఘునాథ్ ఫౌండేషన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు ధర్మ జీవన్‌కుమార్, శ్రీకాంత్ నాయక్, వినోద్‌రెడ్డి, ప్రసాద్, అఖిల్, గోపిముదిరాజ్, శశి, అజిమ్, రాజు, పవన్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు అందజేత

మియాపూర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రెటరీ రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల, మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల శుక్రవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రావు, వినోద్‌రావు, యాదగిరి ముదిరాజ్, శ్రీధర్‌గౌడ్, మహేష్‌యాదవ్, గణేష్ ముదిరాజ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాచకుడు మృతి



హఫీజ్‌పేట్ : యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శుక్రవారం నల్లగండ్ల హుడా లేఅవుట్‌లోని రాక్ పార్కు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (35-45) బ్యాగు నిండా ఖాళీ వాటర్ బాటిళ్ల సంచితో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న చందానగర్ పోలీసులు గమనించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని ఒంటిపై నలుపు,తెలుపు షర్టు, నల్ల ప్యాంటు వేసుకున్నాడు. ఇతన్ని గుర్తు పడితే చందానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

స్థలం కేటాయింపుపై హర్షం

గచ్చిబౌలి: కాపు సంక్షేమ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం హైటెక్‌సిటీ వద్ద 6.35 ఎకరాల స్థలాన్ని కేటాయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే గాంధీని ఆ సంఘం ప్రతినిధుల బృందం శుక్రవారం కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు మిర్యాల రాఘవరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్‌మూర్తి, నాయకులు దాసరి రంగారావు, భరత్‌కుమార్, భగవాన్, శ్రీనివాస్, ఆనందరావు, రాంబాబు, వాసునాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సూచనలు

ఎస్ఆర్‌డీపీ పై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మెరుగైన జీవన ప్రమాణాలు, ట్రాఫిక్ రహిత సమాజం కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పలు ప్రతిపాదనలు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలపై వ్యూహాత్మక రహదార్ల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ)లో అసెంబ్లీలో శుక్రవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. శేరిలింగంపల్లిలో ఎస్ఆర్‌డీపీ కింద ఇప్పటి వరకు పది పనులు చేపట్టగా అందులో తొమ్మిది పనులు పూర్తికాగా మరొకటి పురోగతిలో ఉందన్నారు. కొత్తగా ప్రత్యామ్నాయ రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జీలు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రతిపాదించామన్నారు. శేరిలింగంపల్లిలో అతిపెద్ద భవనాలు, ఐటీ కారిడార్, అత్యధిక ప్రజానీకం నివాసముంటున్న పరిస్థితుల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

శేరిలింగంపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే గాంధీ చేసిన కొత్త ప్రతిపాదనలు ఇవే..

- ఖాజాగూడ కూడలి (దాబా)లో అండర్‌పాస్ నిర్మాణం
- మియాపూర్ నుంచి చందానగర్, లింగంపల్లి మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరణ
- లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌యూబీ లేదా ఆర్‌ఓబీ నిర్మాణం
- విప్రో జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం
- మియాపూర్ కూడలి నుంచి గండిమైసమ్మ వరకు చేపడుతున్న 200 ఫీట్ల ఒడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం
- అపర్ణాహిల్ పార్కు నుంచి గంగారం చెరువు వద్ద హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ రహదారికి కలిపే లింకు రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలి
- హెచ్ఎంటీ స్వర్ణపురి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వరకు లింకురోడ్డు నిర్మాణం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మెట్రో విస్తరణలో పూణే నమూనా అమలు చేయాలి

- మియాపూర్ నుంచి చందానగర్, లింగంపల్లి మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రో కారిడార్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని, అందు కోసం పూణే నమూనాను ఇక్కడ అమలు చేయాలని ఎమ్మెల్యే గాంధీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నమూనా ప్రకారం మెట్రో మార్గం, ఫ్లైఓవర్ ఒకే పిల్లర్ మీదుగా వచ్చే విధంగా నిర్మించాలని కోరారు. మియాపూర్ కూడలి, ఆల్విన్ కూడలిల మీదుగా నిత్యం లక్షకు పైగా వాహనాల రాకపోకలు చేస్తాయన్నారు. రెండు కూడళ్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రెండు కూడళ్ల మీదుగా బీహెచ్ఈఎల్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలన్నారు. లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌యూబీ లేదా ఆర్‌ఓబీని నిర్మాణం చేయాలని ఆయన కోరారు.

ఎస్ఆర్‌డీపీ-2వ దశ పనులు జూన్-2024 నాటికి పూర్తి: మంత్రి కేటీఆర్

శేరిలింగంపల్లిలో ఎస్ఆర్‌డీపీ -2 దశ పనులు జూన్ 2024 నాటికి పూర్తి చేస్తామని మంత్రి కేటీ రామారావు హామీ ఇచ్చారు. లింగంపల్లిలో అండర్ బ్రిడ్జిని రూ.4 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఖాజాగూడ-విప్రో జంక్షన్ సెపరేట్ గ్రేడ్ ఫ్లైఓవర్‌ను రూ.263 కోట్లు, రూ.106 కోట్లతో రెండవ దశలో చేపట్టి పూర్తి చేస్తామన్నారు. హనుమాన్ దేవాలయం నుంచి అపర్ణా హిల్ పార్కు వయా గంగారం చెరువు వరకు లింకురోడ్డును పూర్తి చేస్తామన్నారు, మరి కొన్ని లింకురోడ్లును కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు.



నర్సింగ్ విద్యార్థులు 24 గంటలు సేవలు అందించాలి

- నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి
- మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలాని నర్సింగ్ కాలేజీ రెండవ స్నాతకోత్సవం

హఫీజ్‌పేట్ : నర్సింగ్ విద్యార్థులు వినయం, విధేయత, ప్రేమ ఆప్యాయతలతో 24 గంటల సేవలు అందించాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలాని నర్సింగ్ కళాశాల విద్యార్థుల రెండవ స్నాతకోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సప్తా మార్తా, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వినోద్ కె అగర్వాల్, మహిళ దక్షిత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సామాన్య ఉద్యోగిగా ఉదయం 9 గంటలకు వెళ్లి 5 గంటలకు ఇంటికి రావడం పరిపాటి, కానీ నర్సింగ్ విద్యార్థులు 24 గంటలు సేవలు అందిస్తారన్నారు. డాక్టర్ స్వప్న మార్తా, వినోద్ కె అగర్వాల్‌లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యనందిస్తున్న మహిళా దక్షిత సమితి అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు గ్రాడ్యుయేట్ పట్టాలు అందించి, గత సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యలో రాష్ట్ర మొదటి, రెండు, మూడు, నాలుగు ర్యాంకులు సాధించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. తర్వాత ఇన్ఫోసిస్ ప్రతినిధి వంశీ 25 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు డొనేషన్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మహిళ దక్షిత సమితి సెక్రటరీ అరుణామలాని, ట్రస్టీ సభ్యులు రాజశ్రీ జాయిన్, లక్ష్మి, జయ బెహతి, దివ్య మలాని, అనసూయ, దీప దాడుస్, అరుణమలాని, శకుంతల, సచిన్ మార్తా, వంశీ ముత్యపు, కళాశాల ప్రిన్సిపల్ రమాకుమారి, సుశీల పాటిల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, పక్కన డాక్టర్ సప్తా మార్తా

కాలనీ సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న షేక్ ఖాసీం, ప్రతినిధులు

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌పార్కు కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో కలిసి కాలనీలో సీసీ రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణం, దెబ్బతిన్న బీటీ రోడ్లకు మరమ్మతులు, పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో కాలనీలో పర్యటిస్తానని చెప్పారని కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విల్సన్, సైమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దర్శన్...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయిజ్యోతి నగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని తెలిపారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అశ్విన్‌గౌడ్, కాలనీవాసులు రాజనర్సింహ, మురళీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, వెంకయ్య, భారతి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు, వివిధ కాలనీలవాసులకు శుక్రవారం ఓటర్ నమోదుపై అధికారులు అవగాహన కల్పించారు. ఫారం 6, ఫారం 8 లపై ప్రజలకు వివరించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

39 మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ



ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్‌కు 39 షాపులు కేటాయించినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. కాళీమందిర్‌లోని తెలంగాణ ఎక్సైజ్ అకాడమీలో దరఖాస్తులు స్వీకరిస్తారని, శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో డ్రా ప్రక్రియ ఉంటుందన్నారు.

కబడ్డీ పోటీలు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కబడ్డీ పోటీలలో కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ, కలబురిగి, తుంకూరు క్లస్టర్లు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, కర్నూలు క్లస్టర్లు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ క్లస్టర్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి క్లస్టరు నుంచి బాలురు, బాలికల విభాగం నుంచి అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాలుగా విద్యార్థుల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి.



బండి సంజయ్‌కు ఘనస్వాగతం



గచ్చిబౌలి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు శేరిలింగంపల్లి నాయకులు ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, హన్మంతునాయక్‌తోపాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

భెల్‌లో ఎన్నికల సందడి



బీహెచ్ఈఎల్ సర్కిల్ వద్ద కార్మిక సంఘాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

- ఎక్కడ చూసినా పోస్టర్లు, ఫ్లెక్సీలు..
- జోరుగా విందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ రామచంద్రాపురం యూనిట్‌లో కార్మిక సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 12వ తేదీన బీహెచ్ఈఎల్ అధికార కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు కావడంతో భెల్ టౌన్‌షిప్‌లో ఎన్నికల వాతావరణం నెలకొంది. యూనియన్ కార్యాలయాల వద్ద యూనియన్ నేతలు కార్మికులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. హామీలు గుప్పిస్తున్నారు. కార్మిక సంఘం నేతలు వారి సంఘం అధికారంలోకి వస్తే చేసే కార్యక్రమాలను కార్మికులకు వివరిస్తున్నారు. కార్మిక ఓటర్లను ఆకట్టుకునేందుకు సంఘం నేతలు విందులు ఇవ్వడం విశేషం. బీహెచ్ఈఎల్ ముఖద్వారం నుంచి పరిశ్రమ వరకు వివిధ కార్మిక సంఘం నేతలు ఫ్లెక్సీల ఏర్పాటులో పోటీ పడుతున్నారు. కొందరు తమకే ఓటేస్తారని ధీమాలో ఉన్నారు. ఇక విత్‌డ్రాల ప్రక్రియ పూర్తయితే పోటా పోటీ ప్రచారాలు జరగనున్నాయి. కాగా ఈ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సుమారు 1361 కార్మికులు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

పటాన్‌చెరు టౌన్: భార్య కాపురానికి రావడం లేదనే మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం... ఐలాపూర్ పెద్ద తండాకు చెందిన కిషన్(37) లారీ డ్రైవర్. ఇతడికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. ఆరు నెలల క్రితం కిషన్ భార్య వాణి లు గొడవపడ్డారు. దీంతో భార్యా వాణి పిల్లలను తీసుకొని తల్లిగారి ఇంటికి మియాపూర్ వెళ్ళిపోయింది. అప్పటి నుండి మద్యానికి బానిసైన కిషన్ మూడు నెలల క్రితం తన భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని అడిగాడు. రాను అని చెప్పడంతో ఇంటికి వచ్చి ,భవనం మొదటి అంతస్తులో ఉన్న గదిని తగలబెట్టాడు. తిరిగి గురువారం భార్య వద్దకు వెళ్లి ఇంటికి రమ్మనగా రానని చెప్పింది.దీంతో అక్కడినుండి వచ్చేసిన కిషన్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ –డీఆర్‌డీఓ ఎంఓయూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ), రక్షణశాఖలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) మధ్య ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని డీఆర్‌డీఓ భవన్‌లో హెచ్‌సీయూ, డీఆర్‌డీఓ అధికారులు శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశారు. హెచ్‌సీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు, డాక్టర్ మన్మోహన్ సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, డీఆర్‌డీఓ డీఎఫ్‌టీఎం డైరెక్టర్ కైలాష్‌కుమార్ పాఠక్ సంతకాలు చేశారు. ఒప్పందం కాల పరిమితి 25 సంవత్సరాలు ఉంటుంది. ఈ ఒప్పందం ప్రకారం హెచ్‌సీయూలోని పరిశోధనలను సులభతరం చేయడానికి డీఆర్‌డీఓ తోడ్పాటు అందిస్తుంది. ఈ నూతన ఒప్పందంకు డీఆర్‌డీఓ- ఇండస్ట్రీ అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ-సీఓఈ-హెచ్‌సీయూ)గా నామకరణం చేశారు.



పత్రాలను మార్చుకున్న ఇరు సంస్థల అధికారులు

ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ

మియాపూర్: మియాపూర్ ఆర్‌టీసీ డిపో-1 లో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్ఎం శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ఆదర్శ ఉద్యోగులకు శాలువా కప్పి అభినందించారు. డిపో పరిధిలో డిజిల్ సేవ్ చేసినందుకు గాను 10 మంది డ్రైవర్లు, కలెక్షన్ ఎక్కువగా చేసినందుకుగాను 10 మంది ఉద్యోగులకు, బెస్ట్ మెయింటెనెన్స్ చేసినందుకు గానూ ఇద్దరు ఉద్యోగులను అభినందించారు. డిప్యూటీ ఆర్ఎం రాజు, డిపో-1 డీఎం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు .కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, నాగరాజు, బాలాజీ, రవీందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, జ్యోతి, చిట్టి, కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్ రెడ్డి, నాయకులు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లలిత సోమిరెడ్డి

ఇల్లు అద్దెకు ఉందని నో బ్రోకర్ యాప్‌లో పెట్టి..

- అపరిచిత వ్యక్తి ఫోన్ కాల్‌కు స్పందించి.. లక్ష తొంభై ఎనిమిది వేలు పోగొట్టుకున్న వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: నో బ్రోకర్ యాప్‌లో ఇల్లు అద్దెకి ఉందని పెట్టి ఓ అపరిచిత వ్యక్తి నుండి వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి ఒక లక్ష 98 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన వ్యక్తి నో బ్రోకర్ యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందని పెట్టాడు.ఈ క్రమంలో జూలై 18వ తేదీన అపరిచిత వ్యక్తి నుండి ఫోన్ కాల్ వచ్చింది. కాగా ఆ వ్యక్తి తాను మిలటరీలో చేస్తానని ఇంటికి సంబంధించిన వివరాలు అడిగాడు. అనంతరం తనకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డులను పంపించాడు. ముందుగా బాధితున్ని తన అకౌంట్‌కి ఐదు రూపాయలు పంపమన్నాడు, అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఐదు రూపాయలు పంపాడు. దీంతో వెంటనే అపరిచిత వ్యక్తి పది రూపాయలు వేశాడు. రెట్టింపు నగదు ఇస్తామని చెప్పడంతో నమ్మిన బాధితుడు ముందుగా రూ. 39 వేలు వేశాడు, వేసిన నగదు బ్లాక్ అయిందని తిరిగి రూ.38,995 వేస్తే రెండు కలిపి వేస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో బాధితులు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా నగదు వేస్తూ వచ్చాడు. చివరికి ఒక లక్ష 98 వేలు వేయగా, తాను వేసిన నగదు వెనక్కి పంపాలని అడగగా, ఇంకా నగదు వేయాలని అపరిచిత వ్యక్తి చెప్పడంతో అనుమానం వచ్చిన బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్తీ దవాఖానకు సుస్తీ..

- ఆరు బయట వైద్యసేవలు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : పేదలకు చేరువలో మెరుగైన వైద్యం అందించడానికి ఏర్పాటు బస్తీ దవాఖానకు సుస్తీ చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో గత ఏడాది ఫిబ్రవరిలో బస్తీ దవాఖానను ప్రారంభించారు. వైద్య సిబ్బందిని సైతం ప్రభుత్వం నియమించింది. ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు రూ.7 లక్షల నిధులతో ఆస్పత్రి భవనాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు నాని ఫాల్ సీలింగ్ పడిపోయింది. వర్షాలు కురుస్తున్న సమయంలో వైద్య సిబ్బంది అదే గదిలో ఆరు బయట వైద్యం చేస్తున్నారు. ఇక పది రోజులుగా ఈ భవనానికి విద్యుత్ కూడా నిలిచిపోయింది. దీంతో వైద్య సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరు బయట వైద్యం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఆసుపత్రి భవనానికి మరమ్మతులు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీనివాస్ నగర్ కాలనీ బస్తీ దవాఖాన



పడిపోయిన పైకప్పు సీలింగ్



వర్షపు నీటిలో నానిన బెడ్డు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462